క్లుప్తంగా

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



చింతలూరు నూకాంబికా ఆలయ ముఖద్వారంలో బారులు తీరిన భక్తులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. ఆదివారం సెలవు కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. చిన్నారులతో కాగడాలు వెలిగించి వారకల్లు, తుష్టుబిళ్లను దిష్టి తీయించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుధ్యాన్ని నెలకొల్పుతున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలు అంతంత మాత్రమే ఉండటంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.

పాళ్లమ్మ జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ అమ్మవారి జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలు అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని ఆవిష్కరించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజులు జరుగుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారం



సినీనటుల నుంచి అవార్డు అందుకుంటున్న మెజీషియన్ అలీ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన అంతర్జాతీయ మెజీషియన్ అలీ ఉగాది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ సిటీ సెంట్రల్ కోర్టు హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ సంగమం ఫౌండేషన్ మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారం అందించి సత్కరించింది. ఫౌండేషన్ అధ్యక్షులు సంజయ్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ సినీ నటులు తనికెళ్ల భరణి, వై.విజయ, దర్శకుడు రేలంగి నరసింహారావు మెజీషియన్ అలీకి ఉగాది పురస్కారాన్ని అందించారు. కళారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మెజీషియన్ అలీకి ఈ పురస్కారం అందించామని ఫౌండేషన్ అధ్యక్షులు సంజయ్ కిశోర్ తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పి.గన్నవరంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న పార్టీ నేతలు

పి.గన్నవరం: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ మండల శాఖ అధ్యక్షులు తిక్కా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డొక్కా సీతమ్మ అక్విడెక్టు వద్ద నిర్మించిన పార్టీ స్థూపాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీవేమా ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, పార్టీ నేతలు ఆరుమిల్లి వీరభద్రరావు, చీకురుమెల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, అడ్డాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం పల్లవారిపాలెం వివేకానంద వారధిపై నుంచి ఒక వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అల్లవరం మండలం గుడ్డివాని చింత ప్రాంతానికి చెందిన జమ్మి జనార్ధనరావు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం వివేకానంద వారధిపై నుంచి గోదావరిలో దూకాడు. అదే సమయంలో వారధి కింద చేపలు పట్టుకుంటున్న జాలర్లు ఆ విషయం గమనించి జనార్ధనరావును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆ ప్రాంతానికి చేరుకుని జనార్ధనరావును ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో వర్తక సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం



అయినవిల్లిలో సీతారామచంద్ర స్వామికి విశేష పూజలు చేస్తున్న అర్చకులు



మాచవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



మామిడికుదురులో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ప్రసాద్ దంపతులు



రావులపాలెం సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నయనానందం రాములోరి కల్యాణం

- అంగరంగ వైభవంగా శ్రీరామనవమి
- వీక్షించి.. పులకించిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు

మామిడికుదురు: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. రామాలయాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పందిళ్లు ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపాల్లో సీతారాములను అధిష్టింపచేసి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఈదరాడలో డాక్టర్ యెరుబండి శ్రీఫణిరామ్, జానకీరమణి దంపతులు, మామిడికుదురు గ్రామదేవత నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీరామాలయం వద్ద నయనాల నాగేంద్ర ప్రసాద్, జగదీశ్వరి దంపతులు, మామిడికుదురు, నగరం ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో తటవర్తి మాణిక్యాలరావు, కనకదుర్గ దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. శ్రీరామనవమి సందర్భంగా పలు చోట్ల భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో ఏర్పాటు చేసిన నవమి పందిరిలో సీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వర్తక సంఘ నాయకులు, సభ్యులు, వ్యాపారులు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక డీఎస్ పాలెం, పితానివారిపాలెం రామాలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధనలు నిర్వహించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తరతరాలు, అన్ని యుగాలకు ఆదర్శప్రాయుడిగా శ్రీరామచంద్రుడ్ని కొలుస్తామని, అందుకు ఆయన గుణశీలాలే కారణమని పలువురు వేద పండితులు పేర్కొన్నారు. మండలంలో శ్రీ సీతారామకళ్యాణ మహోత్సవ వేడుక కన్నుల పండువగా జరిగింది. కళ్యాణ, పట్టాభిషేక మహోత్సవాలు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులకు పానక ప్రసాదాలు, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో సీతారామాంజనేయస్వామి విగ్రహాలను నూతన రంగులతో, పూలమాలలతోనూ, పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణాన్ని వైభవం జరిపారు.

మలికిపురంలో..

మలికిపురం: కడలివారి గ్రూపులో ఉన్న రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించిన కడలి మధు దంపతులను, ఆయన సోదరులను ఆశీర్వదించారు. స్వామివారి ఆశీస్సులు తీసుకున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుతో పాటు నాయకులు స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గోపాలపురంలో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



మలికిపురంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

ఆలమూరులో..

ఆలమూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలు శ్రీరామనామ స్మరణతో మార్మోగిపోయాయి. వైష్ణవాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. వసంతరుతువులో వచ్చే చైత్రమాస శుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రంలో ఏటా శ్రీరాముని జన్మదినాన్ని శ్రీరామ నవమిగా చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రామాలయాలన్నీ రంగురంగుల విద్యుత్‌లంకరణతో దేదీప్యమానంగా అలంకరించబడ్డాయి. సంధిపూడిలోని కాపుల వీధి రామాలయం వద్ద వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య రాజమహేంద్రవరానికి చెందిన సూరపురెడ్డి రాజబాబు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: శ్రీరామనవమి పురస్కరించుకుని గ్రామ గ్రామాన, వాడవాడలా సీతారాముల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. కొత్తపేట సత్యాసెంటర్ కోదండరామస్వామి వారి ఆలయం (కొత్తరామాలయం)లో నూతన దంపతులు తిరుమలశెట్టి సుధారాణి-వెంకటసుబ్రహ్మణ్యం దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్, వేదపండితులు ఆగమ శాస్త్రం ప్రకారం వేద మంత్రోచ్ఛారణ, సీతారాముల వంశ పుట్టుపూర్వోత్తరాలు, వారి కల్యాణం కథన వ్యాఖ్యానం నడుమ ప్రధాన ఘట్టం నుంచి తలంబ్రాల వరకూ కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. పలువురు భక్తులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు. అనంతరం బెల్లం పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. భారీ సంఖ్యలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీరామనగర్ రామాలయంలో మామిడిశెట్టి సోమరాజు, రామకృష్ణ, గోవిందు సోదరుల దంపతులతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు, కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఆత్రేయపురంలో..

లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆలయ నిర్మాతలు పాతపాటి రామాంజనేయరాజు-లక్ష్మి, పాతపాటి వెంకటసత్యనారాయణరాజు-రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు, సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాతపాటి సోదరుల దంపతులు స్వామి, అమ్మవారికి సుమారు రూ.5 లక్షలు విలువ చేసే బంగారం మంగళసూత్రాలు, తాడు, ముత్యాల హారం, పూజకు ఉపయోగించే వెండి పళ్లెం, గిన్నెలు తదితర వస్తువులతో పాటు కల్యాణ పట్టు వస్త్రాలు, కళ్యాణ సామగ్రి, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆ దంపతుల చేతుల మీదుగా ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి పవన్ దీక్షితులు, వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాలు జరిగాయి. రావులపాలెంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పడాల కొండారెడ్డి, లీలావతి దంపతులు, భాస్కరరెడ్డి సుస్మిత దంపతులు కల్యాణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పెద్దింటి పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ పూజలు నిర్వహించారు. స్వామికి ముత్యాల తలంబ్రాలు కానుకగా సమర్పించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సీతాదేవికి కుంకుమార్చనలు జరిగాయి. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, చిన కేవీ, మల్లిడి కోటేశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

సీతారాముల ఆలయాల్లో జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు

మండలంలోని పలు రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సీతారాముల కల్యాణంలో జగ్గిరెడ్డి పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. రామాలయాలలోను, ఆంజనేయస్వామివారి ఆలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు చేశారు. టేకిశెట్టిపాలెం రామాలయం వద్ద సర్పంచ్ దేవీ దుర్గ, తాతయ్య నాయుడు దంపతులు నిర్వహించిన స్వామి కల్యాణంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్వామికి పూజలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాలలోని రామాలయాల్లో భక్తులు ఉదయం నుంచి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, సిరిపల్లి, నల్లచెరువు, కొండుకుదురు, వీరవల్లిపాలెం, తొత్తరమూడి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయినవిల్లిలో సీతారామచంద్రస్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామివారి ఆలయాల్లో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేడుకలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.



ఆత్రేయపురంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న పాతపాటి సోదరుల దంపతులు



కొత్తపేట కొత్త రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న నూతన దంపతులు



సంధిపూడిలోని రామాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



టేకిశెట్టిపాలెం రామాలయం వద్ద కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

చింతలూరులో ట్రాఫిక్ జామ్



చింతలూరు నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

మూడు గంటల పాటు నరకయాతన

ఆలమూరు: చింతలూరులో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారి తీర్థానికి వచ్చిన భక్తులతో పాటు భారీ వాహనాల రాకపోకల వల్ల విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో పాటు భారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించడంతో కొత్తూరు నుంచి వెదురుమూడి రోడ్డులో రెండు కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీనివల్ల చంటిపిల్లల తల్లులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సుమారు మూడు గంటల పాటు నరకయాతన అనుభవించారు. ట్రాఫిక్ దుస్థితిపై స్పందించవలసిన దేవదాయశాఖ, పోలీసుశాఖ ఆలస్యంగా స్పందించడంతో ప్రయాణికులే ట్రాఫిక్ కానిస్టేబుల్స్ అవతారం ఎత్తి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల వాహనాలను ఒక పద్ధతి ప్రకారం కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ఈ ట్రాఫిక్ సమస్యకు కారణమైంది. చింతలూరు తీర్థంలోని ఏర్పాట్లను కేవలం మూడు రోజులకే పరిమితం చేసి అనంతరం భక్తుల సౌకర్యాల కల్పన గాలికి వదిలేయడంతో ఏటా ఈ పరిస్థితి సంభవిస్తుందని భక్తులు ఆరోపిస్తున్నారు.

భక్తులపై అంత నిర్లక్ష్యమేలా!

నూకాంబిక అమ్మవారి తీర్థానికి సంబంధించి భక్తులు నెల రోజుల పాటు ప్రతి ఆది, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారని అధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తూ నిర్లక్ష్య ధోరణితో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై దేవదాయశాఖ పర్యవేక్షణలో ఇతర శాఖల అధికారులు నిర్వహిస్తున్న విధుల నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ జామ్ సమస్యపై పోలీసు స్టేషన్‌కు వినతులు వెల్లువెత్తడంతో ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ నేతృత్వంలో సిబ్బంది వచ్చి కొద్ది సమయం తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం, విశ్వావసు నామ సంవత్సరం, శ్రీరామనవమి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 25 మంది, శ్రీలక్ష్మీగణపతిహోమంలో 10 జంటలు, స్వామివారి గరికపూజలో ఇరువురు జంటలు పాల్గొన్నారు. స్వామి వారి సన్నిధిలో ఇరువురు చిన్నారులకు అక్షరాభ్యాసం, తొమ్మిది మందికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. ముగ్గురు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. స్వామికి ఏడుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 37 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 3100 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,86,487 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



స్వామివారి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు

ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



కొత్తపేటలో మహిళలకు యోగా శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్

కొత్తపేట: స్వామి వివేకానంద యోగా శిక్షణ కేంద్రం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఈ శిక్షణలో ప్రత్యేకంగా మహిళలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి దోహదపడే వివిధ యోగాసనాలు చేయిస్తూ అవగాహన కల్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా వలన ఒత్తిడిని నియంత్రించి బీపీ, సుగర్ వంటి వ్యాధులను కంట్రోల్ చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కనీసం ఒక గంట సమయం యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు నివారించుకోవాలని సూచించారు.

నిత్యం శ్రీకృష్ణుని నామస్మరణ చేయాలి

అయినవిల్లి: నిత్యం శ్రీకృష్ణుని నామస్మరణ చేయాలని అప్పుడే భగవంతుని దామం చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాలు ఏమి అయితే చెబుతున్నాయో అవే మానవులు ఆచరించాలన్నారు. ఇప్పుడు కొంత మంది తామే భగవంతునిగా ప్రకటించుకుంటూ తమకే పూజలు చేయండి అంటూ దొంగబాబాలు పుట్టుకొస్తున్నారన్నారు. భగవంతుడు ఒక్కరే ఉన్నారూ ఆయన్నే సమస్త ప్రాణికోటి పూజించాలన్నారు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. అనంతరం స్వామి మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రభుత్వ బడిబాట, బంగారుబాట



పల్లిపాలెంలో పిల్లలను చేర్పించే అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న ఎంఈవో-2, సర్పంచ్ శ్రీనివాస్

సఖినేటిపల్లి: మన పాఠశాల, మనందరి బాధ్యత కాన్సెప్ట్‌లో భాగంగా ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని పల్లిపాలెం మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ మేరకు ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఫీజులెందుకు దండగ, ప్రభుత్వ బడి ఉండగ, పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ప్రచారం ఉపాధ్యాయులు చేపట్టారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లితండ్రులకు తగిన అడ్మిషన్ పత్రాలను ఎంఈవో-2, సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్ అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ కొపనాతి వెంకట్రాజు, హెచ్ఎం పి.సత్తిపండు, టీచర్ మౌనిక మణి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, విద్యాశాఖ సిబ్బంది బి.శ్రీనివాస్, బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుతో సమృద్ధిగా పోషకాలు

మామిడికుదురు: బహుళ పంటల సాగుతో పంటలకు సమృద్ధిగా పోషకాలు అందుతాయని అడిషనల్ డీపీఎంఓ సత్యనారాయణ సూచించారు. ఈదరాడలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవధాన్యాల సాగుతో గ్రీన్ కవర్ పెరిగి రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందన్నారు. బహుళ పంట సాగుతో కలుపు మొక్కల బెడద తగ్గి తద్వారా చీడ, పీడల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. పీఎండీఎస్‌గా వ్యవహరించే నవ ధాన్యాల సాగుతో చేనుకు చేవ, రైతుకు రొక్కం అన్న నానుడి సాధ్యమవుతుందన్నారు. బహుళ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీని వల్ల నేల కోతకు గురికాకుండా ప్రధాన పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంటీ నాగవేణి, ప్రకృతి వ్యవసాయం విభాగం ప్రతినిధులు కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, స్వాతి, విజయలక్ష్మి, కుసుమ పద్మావతి, ప్రసన్నకుమార్, రైతులు యెరుబండి లక్ష్మయ్య, కుడుపూడి వెంకటేశ్వరరావు, నక్కా రాజేష్, యెరుబండి నాగబాబు పాల్గొన్నారు.



బహుళ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీపీఎంఓ సత్యనారాయణ